కథ

# చింతగింజలు

- మురళీమోహన్ క్రోవి

"ఒరేయ్ చంటి వెధవాయ్, మడి బట్ట తాకుకుంటూ, ఆ పరుగేమిటిరా!" సుందరమ్మగారి అరుపుకి తోడుగా పక్కింట్లో బుస్‌మని చప్పుడు చేస్తూ కుక్కర్ విజిల్. చంటిగాడు, అదే వాడికో పేరుందనుకోండి, శ్రవణ్ అవేవి పట్టించుకునే స్థితిలో వున్నాడా ఏమిటి. ఆరేసిన మడి చీర కింద నుంచి తాకుతూ పరుగెత్తుకుంటూ సుందరమ్మగారి దగ్గరికి వచ్చి "గుడ్ మార్నింగ్ బామ్మగారు. ఈరోజు నేనే మీకు ఫస్ట్, ఫస్ట్ గా గుడ్ మార్నింగ్ చెప్పాను చూసారా" ఎంతో ఉత్సాహంగా చెప్పాడు.

సుందరమ్మగారికి వాడిని చూస్తే ఎంతలేసి కోపం యిట్టే మాయమవుతుంది. "పోనీలేరా! చంటి పిల్లలు దేవుడితో సమానం కదా! మడి చీరకి ఏమీ కాదులే" అంటూ అర్థంకాని వాడి వంక చూసి, "ఏమిటి యింత వుదయాన్నే లేచావు. అప్పుడే అమ్మ వంట కూడా చేస్తోంది" అడిగింది ఆకాశం వంక చూస్తూ సూర్యభగవానుని రాక కోసం. ముందురోజు సాయంత్రం కోసిన, పెరట్లోని బాదం ఆకులు ముందు వేసుకుని విస్తళ్ళు కుట్టుకుంటోంది అరుగుమీద కూచుని సుందరమ్మగారు. మెట్లమీద తిష్టవేసాడు శ్రవణ్.

కొద్దిసేపటికి పక్కింటి సీతావతి వచ్చి, "ఏమిట్రా బామ్మ గారిని వుదయాన్నే విసిగిస్తున్నావా, పద యింటికి" చెప్పింది శ్రవణ్ చెయ్యి పట్టుకొని. సుందరమ్మగారి వంక చూసి "ఆయనకు వుదయం డ్యూటీ వేసారండి యీ నెలంతా. యిదిగో మాతోపాటే లేచి కూర్చున్నాడు. పని చేసుకోనీకుండా" చెప్పింది సీతావతి.

"వాడు నన్ను విసిగించగలడా తల్లి, నువ్వంటే వాడితోపాటు పరుగులు పెడతావు కాబట్టి అలా అనిపిస్తుంది. నాదేముంది ఎక్కడో ఒక చోట కూర్చుంటే, వాడేవచ్చి ప్రక్కన జేరి ఏవో ఒకటి కబుర్లు చెబుతాడు. అయినా యీ మధ్య బాగా మాటలు నేర్చాడమ్మోయ్. బడిలో వేసేస్తే సరి", బిక్కమొహంతో వున్న శ్రవణ్‌ని చూసి నవ్వుతూ చెప్పింది సుందరమ్మ.

"అయినా యిప్పుడు నాకు హడావుడిపడి చేసే పనులేమీ లేవు కదా! నీ పని చేసుకురా, వాడిని నేను చూస్తూ వుంటాలే." "పొద్దు కనబడందే మడికట్టలేను, ఎసరు వేయలేను. అసలే వర్షాకాలం, మబ్బు వీడితే మొదలు పెట్టుకోవచ్చు పనులు" చెప్పింది సుందరమ్మ. సీతావతి అలాగేనని యింటివైపు హడావుడిగా అడుగులు వేసింది.

మొత్తంమీద యిరవై విస్తరాకులు తయారయ్యాయి. అప్పటికే ప్రహరీ గోడ మీదకి కాకి ఒకటి వచ్చి వాలింది, అక్కడేమన్నా భోజనాల కార్యక్రమం వుందనుకుందో ఏమో! "హుష్ హుష్" కాకిని బెదరగొడుతూ చెయ్యి వూపారు సుందరమ్మగారు. కాని కాకి ఏ మాత్రమూ బెదరలేదు. అటూ యిటూ కదలడం తప్ప. "బామ్మగారు! కాకివస్తే ఎందుకు తోలగొడుతున్నారు. అదేమీ మిమ్మల్ని భయపెట్టదుగా" అడిగాడు శ్రవణ్. "అది కాదురా, కాకి యింటి మీద వాలితే చుట్టాలొస్తారని పెద్దలంటారు కదా! వాళ్ళని చూస్తేనే భయంరా!"

ఇంతలో అక్కడి కాకికి తోడుగా మరొక కాకి వచ్చి ప్రక్కనే జేరి 'కా, కా, కా' అంటూ కాకి కబుర్లు మొదలు పెట్టింది. "అబ్బో ఒకటి కాదు, రెండు జేరాయి రోయ్, వీటిల్ని పంపించాల్సిందే" అంటూ లేచి, చిన్న రాయిని తీసుకొని వాటిల్ని చెదరగొట్టారు సుందరమ్మగారు, అదేదో ముంపు ముంచుకొస్తున్నట్టుగా!

"ఒరేయ్ శ్రవణ్, నాన్నగారు డ్యూటీకి వెళ్తున్నారు టాటా చెబుదువుగాని రా!" పక్క పోర్షన్ నుంచి సీతావతి పిలుపులాంటి అరుపు, వెంటనే చంటిగాడి తుర్రుమనే పరుగు.

సోమవారం వుదయం కావటం మూలానేమో, సూర్యుడు కూడా బద్ధకంగా ఒళ్ళు విరిచి, మబ్బుల చాటు నుంచి కిరణాల జడివాన కురిపించడానికి సిద్ధమయ్యాడు. సుందరమ్మ గారు లేచి, విస్తళ్ళ దొంతర వంటింట్లో ఒకే మూల గూట్లో పెట్టి, కిటికీ లోంచే సూర్యునికి నమస్కరించి, మడి కట్టుకోడానికి సన్నద్ధమయ్యారు.

సిటీకి దూరంగా చిన్నకాలనీ. అక్కడక్కడ విసిరినట్లు వున్న యిళ్ళు. అందులోనే ఒక చిన్న యిల్లు సుందరమ్మగారిది. యిల్లంటే, ఏమిటో అనుకునేరు, రెండు గదుల పోర్షన్. అందులోనే ఒకటి వంటిల్లు. ఒక మూల చిన్న రోలు. మరొక మూల చిన్న దేవుడి గూడు. గ్యాసు

పొయ్యి వుండనే వుంది. బయట పెరట్లో తులసికోట, చుట్టూ ప్రదక్షిణానికి నాపరాళ్ళ బండలు పరచి వున్నాయి. ఒక మూల బాదం చెట్టు, చెట్టు నీడలో బోరింగ్ మోటారు. పెరట్లో అప్పుడే మొలకెత్తుతున్న పచ్చటిగడ్డి, బట్టలారేసుకోవటానికి అడ్డంగా రెండు తీగలు.

పొద్దు చూడందే సుందరమ్మగారు మడికట్టరు. మడి కడితేనే పూజ, అందులో భాగంగా తులసమ్మకి పలకరింపు. ఆమెకున్న మంచి స్నేహితులలో ఒకరు శ్రవణ్, మరొకరు తులసమ్మ. కబుర్లయినా, కాకరకాయలైనా వారిద్దరితోటే ఎక్కువ కాలక్షేపం. పక్కింటి సీతావతితో అప్పుడప్పుడు కష్టసుఖాలు, పురాణాలలో తనకు తెలిసిన నీతివాక్యాలు పంచుకోవటం. శ్రవణ్ పుట్టిన దగ్గర నుంచి,వాళ్ళ ప్రక్క పోర్షన్‌లో వుండటం మూలానేమో, వాడిమీద చెప్పలేనంత మమకారం పెంచుకున్నారు, పంచుకుంటున్నారు కూడా.

గుండెల్లో మమకారాలని నింపుకుంటే అవే మనసులోతుల్లో అప్పుడప్పుడు కారాలని గుప్పిస్తుందని తెలియని వ్యక్తి కాదు సుందరమ్మగారు.

0-0-0

మధ్యాహ్నం వేళ అయినా, మబ్బులవల్ల చల్లదనం వీడలేదు. ఉతికిన బట్టలు ఆరేద్దామంటే ఏ నిమిషానికి జల్లు పడుతుందో తెలియని స్థితి. అయినా అలాగే మబ్బుల మాటున దాగిన చినుకుకి దడవకుండా, బట్టలు ఆరేసి, తలుపులుదగ్గరికి వేసి, సుందరమ్మగారు తలుపు వారగా నేలమీద, చల్లదనానికి కాబోలు, దిండు వేసుకుని కూర్చున్నారు. ఒళ్ళో, చేటలో, ముందు రోజు సుబ్బయ్య కొట్లో కొన్న చింతపండులో గింజలు ఏరుకుంటూ, "ఏ తీరుగ నను దయచూసెదవో ఇనవంశోత్తమ రామా!" సన్నగా రాగాలాపన చేసుకుంటున్నారు.

"ఏమిటి పిన్నిగారూ! భోజనం చేసారా" పలకరించింది సీతావతి. "ఒక్క క్షణం కనీసం నడుం వాల్చక పోయినా తీరికగా కూర్చోరాదూ, భోజనం చేసేసుంటే అసలే యీ మధ్య వాతావరణం వల్లనేమో ఆయాస పడుతున్నారు."

"తొందరవేళ పొద్దు కనబడేసరికి, భోజనానికి ఏ మాత్రం ఆలస్యంకాలేదు. మనకంతా కడుపే కైలాసం, వాకిలే వైకుంఠం కదా! మరిక తీరికగా కూర్చోటమంటావా, యిప్పుడు చేస్తున్నదదేగా" చెప్పింది సుందరమ్మ.

"అయినా మీ పిచ్చిగాని, ఆ గింజలున్న చింత పండు కొని, ఏరటమెందుకు? మీరు వాడే కాస్తంత పులుపుకి గింజలు లేకుండా దొరుకుతుందిగా" అడిగింది సీతావతి, తను కూడా కాస్తంత చెయ్యి సాయం చేస్తూ.

"లేదమ్మా శ్రవణ్‌గాడికి, చింతగింజలు చూపిస్తానని చెప్పాను. వాటిని మధ్యకి పగలతీసి, అష్టాచెమ్మా, పులీ మేక లాంటి ఆటలు నేర్పిస్తే, కాస్త వ్యావత్తు ఏర్పడుతుంది. అందుకనే కొన్నాను. నువ్వేమో యిప్పుడప్పుడే బడికి పంపించనంటివాయే! అయినా యింట్లో ఏం చేస్తున్నాడు ఒక్కడే. ఎప్పుడూ నీ కొంగట్టుకు తిరుగుతాడుగా" అడిగింది సుందరమ్మ.

"ఉదయం అనగా లేచాడు కదండీ, నీళ్ళు పోసుకుని, కాస్తంత పెరుగన్నం తిని పడుకున్నాడు" అని చెప్తూ "మీరేమీ అనుకోనంటే ఒక మాట అడుగుతాను." సుందరమ్మగారు ఒప్పుకోలుగా తలాడించాక, "వాడికీ మధ్య మొండితనం ఎక్కువవుతోందేమోననిపిస్తోంది. మీతోటి చనువువల్లనో, లేక గారాబం వల్లనో!" తటపటాయిస్తూ చెప్పింది సీతావతి, చింతపండు మధ్యలో యిరుక్కున గింజను బలవంతంగా తీస్తూ -

"యిందులో నేను అనుకోవలసింది ఏమీలేదు. నువ్వేమీ తప్పుగా మాట్లాడావని అనుకోవద్దు. ఏదో కొంచెం ముద్దు చేసిన మాట నిజమే. నాకంటూ మనమడో, మనుమరాలో ఉంటే ఆ మాత్రంచేయనా ఏమిటి?" ఎవరినో పోగొట్టుకున్న బాధతో కన్నీరు ఆపుకోలేక పోయారు సుందరమ్మగారు. "ఏదో ఆయన పుణ్యమా అని నేను ఈ మాత్రం స్థితిలో వున్నందుకు సంతోషించాలో, లేక నాకోసం తన వారినందరిని, చివరకు కొడుకుని కూడా వదులుకున్న ఆయనగారి గతం తలుచుకొని బాధపడాలో అర్థంకాని పరిస్థితిలో ఉన్న నాకు ఒకప్పుడు కాని, ఎప్పటికీ ఓదార్పులతో పని లేదు." సీతావతికి ఏమి మాట్లాడాలో, ఎలా స్పందించాలో తెలియని ఆ సమయంలో, మళ్ళీ సుందరమ్మే మాట్లాడుతూ -

"ఎక్కడో వృద్ధాశ్రమంలో పనిచేసుకుంటూ బతుకుతున్న నన్ను తన కోసం కంటే, తన కొడుకుని దృష్టిలో వుంచుకొని ఆయన నాకు భార్య స్థానం కల్పించినా, 'అమ్మా' అని వాడెప్పుడూ నన్ను పిలువలేదు. హాస్టల్‌లో చేర్పిస్తే యింటి విలువ, అమ్మ విలువ తెలిసి వస్తుందనుకొంటే, అక్కడే బాగుందని చదువు సాగించి, దేశాలొదిలి వెళ్ళి పోయాడు. ఆయనగారు ఎంత నచ్చుదాయించినా వినే తీరికా, ఓపికా లేనట్లు ప్రవర్తించేవాడు. గడపతొక్కి లోపలికి వస్తే కదా యింటి

**గుండెల్లో మమకారాలని నింపుకుంటే అవే మనసులోతుల్లో అప్పుడప్పుడు కారాలని గుప్పిస్తుందని తెలియని వ్యక్తి కాదు సుందరమ్మగారు.**

విలువ తెలిసేది. మమకారాలు, ఆపేక్షలు మండుటెండలో ఆవిరయిపోతుంటే, పదవీ విరమణ చేసాక యీ ఇల్లొకటి కట్టి, అదిగో ఆ బల్లమీద వుందే, ఆ నల్ల ఫోను పెట్టించుకొని ఎదురుగా పడక్కుర్చీలో కూర్చుని, రింగ్ కోసం వేచిచూసేవారు. మా వృద్ధాప్యంలో నయినా వచ్చి పలకరిస్తాడని, ఆదరిస్తాడని మాత్రంకాదు.'' మాట గీరపోతుంటే ప్రక్కనే చెంబులోంచి గుక్కెడు మంచినీళ్ళు గొంతులో పోసుకున్నారు బామ్మగారు.

అంతలో ఫోను మోగిన చప్పుడుతో, సీతావతే వెళ్ళి తీసుకుని, "హలో ఎవరు" అడిగింది. "బామ్మగారు వున్నారా!" " ఆఁ వున్నారు. పిలుస్తాను లైనులో వుండండి" చెప్పింది. "పిలవక్కర్లేదు లెండి. వున్నారో లేరో తెలుసుకోవాలని చేసాను." ఎవరిదో మొగగొంతు, పేరు చెప్పకుండానే ఫోను పెట్టేసారు. అదే సంగతి బామ్మగారికి చెప్పింది సీతావతి.

"ఈలాంటి తంతు మామూలేనమ్మా! ఎవరో ఒకరు వారం పదిరోజుల కొకసారి ఫోను చేయటం, నేను 'హలో' అనగానే పెట్టేయటం. బహుశా నేను బతికున్నానో, లేదో తెలుసుకోవటం కోసమేమో. ఆయనగారి వైపు బంధువులనుకుంటాను. వస్తాడనుకున్న కొడుకు పత్తా లేకపోయేసరికి, వారి ఆశంతా ఈ కొద్దిపాటి స్థలం, యింటి కోసమేగా! లేకపోతే యింకే ముంది నా దగ్గర! ఇలాంటి వారంతా సమాజంలో హోదాలో బతుకుతున్నా, పుచ్చిపోయిన చింతగింజల్లాంటి మనసున్న మనుషులు."

మొత్తానికి కిలో చింతపండులోంచి, రెండు గుప్పెళ్ళ గింజలు ఏరారు, యిద్దరూ కలసి. సీతావతి వాటిని ఎండబెట్టటానికి, పాతబట్ట తీసుకుని పెరట్లోకి వెళ్ళింది. సుందరమ్మ మిగిలిన చింతపండు డబ్బాలోకి ఎత్తి, వంటింట్లో పెట్టడానికి కాలుజాపి నెమ్మదిగా లేచింది. వంటింట్లో వుండగా మళ్ళీఫోను మోగింది. ఎన్నిసార్లు మోగినా, ఎన్నిసార్లు కట్ అయిపోయినా, ఏదో తెలియని ఆత్రుత. అందుకేనేమో సుందరమ్మగారు ఫోను వున్న బల్లవైపు విసుగులేకుండా అడుగులు వేసారు.

ఫోను ఎత్తి 'హలో' అనగానే, అటువైపు నుంచి, "నాయనమ్మా! ఎలా వున్నావు" ఎంతో ఆప్యాయతతో పిలుపు వినిపించింది. కొద్దిసేపు నోటి వెంట మాటల్లేవు. చేతిలో ఫోను వదల్లేదు. ఏదో తెలియని ఆపేక్ష కదలనీయ కుండా చేస్తోంది బామ్మగారిని. కానీ, కను కొసల వెంట ఆగని కన్నీరు, గొంతులోంచి బయటపడని మాటల ఒరవడి.

మళ్ళీ అదే పిలుపు, అదే గొంతు "నాయనమ్మా ఎలా వున్నావు. ఏమిటి, మాట్లాడటం లేదు. నేను రోహిత్‌ని నాయనమ్మా ! ఏమిటి గొంతు గుర్తు పట్టలేక పోతున్నావా, లేక సరిగా వినబడటం లేదా!"

"లేదురా కన్నా! నీమాట కోసమే కదరా ఎన్నాళ్ళ నుంచో ఎదురుచూస్తోంది. నాన్నా, అమ్మా ఎలా ఉన్నారురా? ఇన్నాళ్ళకైనా నా గురించి నీకు చెప్పాడా మీనాన్న. ఎక్కడ నుంచి మాట్లాడుతున్నావు? నన్ను చూడటానికి ఎప్పుడు వస్తున్నావు? నీకు బోలెడు కబుర్లు, కథలు చెప్పాలి. నీతో చాలా ఆటలు ఆడుకోవాలి.... ఇంకా నీకు గోరు ముద్దలు తినిపించాలి. నా ఫ్రెండ్ శ్రవణ్‌ని పరిచయం చేయాలి. భలేగా కబుర్లు చెబుతాడు తెలుసా? నీకెలా తెలుస్తుంది, వచ్చాక చెబుతానులే.'' పొంగుకొస్తున్న దుఃఖాన్ని ఆపుకొని, గబగబా చెప్పాలనుకొన్నవన్నీ చెప్పలేక, ఆయాసపడుతూ, కొంచెం సేపు మాటలాపింది సుందరమ్మ.

"సరేగాని నాయనమ్మా! నేను ఈ రోజే అమెరికా నుంచి బొంబాయికి వచ్చాను. వారం రోజులలో ఆఫీసు పని ముగించుకొని, అక్కడికి వస్తాను. అప్పుడు వింటాను నీ కబుర్లన్నీ. మన వాళ్ళందరికీ చెప్పు, వీలుంటే కలుస్తానని. ఇక వుంటాను. బై, బై, నాయనమ్మా." ఫోను పెట్టేసాడు రోహిత్.

ఎక్కడో, మనసులో పిసరంత అనుమానం కలుగుతోంది. ఫోను పెట్టేసిన తరువాత, నంబరు చూసుకున్నాడు రోహిత్. చూస్తే యింటి నంబరు కాదు. తప్పు నంబరు డయల్ చేసాననుకున్నాడు. మళ్ళీ సరియైన నంబరుకి ఫోను చేసి, తను వస్తున్న సంగతి చెప్పాడు. కాని, యింతకు ముందు మాట్లాడిన పెద్దావిడ, ఎవరై వుంటారు! అంతలా మనమడి కోసం ఎదురు తెన్నులు కాస్తున్నట్లున్నారు. ఎవరూ, ఎప్పుడూ పలకరించని వారిలా, గబగబా ఆ మాటలు, ఆపేక్ష ఆవిడ మాటలలో ప్రతి స్పందిస్తున్నాయి. ఎవరో కనుక్కొని, ఊరికెళ్ళాక తప్పకుండా కలుసుకోవాలి అనుకున్నాడు రోహిత్ నంబరు డైరీలో నోట్ చేసుకుంటూ.

ఫోన్ పెట్టేసిందనే కాని, సుందరమ్మగారి సంతోషం అంతుపట్టలేకుండా వుంది. పరుగులాంటి నడకలో వాకిలి దగ్గిరికి వచ్చి, మెట్లమీద కూర్చుని, సీతావతిని కేకవేసి, పిలిచింది. ఈవిడగారు ఆయాసపడటం చూసి కంగారుగా ఒక్క పరుగున చేరుకుని, "ఏమైంది పిన్నిగారూ, ఒంట్లో ఎలా వుంది'' అడిగింది సీతావతి. వెనకాలే, అప్పుడే లేచాడేమో, శ్రవణ్ ఆవలించుకుంటూ వచ్చి, కింది మెట్టు మీద కూర్చున్నాడు.

"మనుమడు, నా సొంత మనుమడు, అమెరికా నుంచి వచ్చాడుట. బొంబాయి నుంచి ఫోన్ చేసాడు. వారం రోజులలో వస్తాడుట నన్ను చూడటానికి, యిన్నాళ్ళకి ఆయన గారు నమ్ముకున్న ఫోన్‌కి సార్థకత చేకూరింది. ఎంత ఆప్యాయంగా మాట్లాడాడనుకున్నావు. మన శ్రవణ్ గాడి గురించి కూడా చెప్పాను'' అంటూ చంటిగాడిని దగ్గరికి తీసుకొని, వాడికోసం ఏరి, ఎండ బెట్టిన చింత గింజలు చూపించింది.

''ఎంత మంచి వార్త చెప్పారు పిన్నిగారు. నమ్మశక్యంగా లేదు కదూ. యింక మీరు నిశ్చింతగా వుండొచ్చు'' చెప్పింది సీతావతి. యివేవీ అర్థంకానట్టు, మళ్ళీ మళ్ళీ బద్ధకంగా ఆవలిస్తూ, వాళ్ళిద్దరి ఆనందాన్ని ఆశ్చర్యంగా చూస్తూ, వూరకుండిపోయాడు చంటిగాడు.

0-0-0

మరుసటి సోమవారం, సుందరమ్మగారి యింటి ముందు కారులోంచి దిగాడు రోహిత్. చిన్న యినపగేటు కిర్రుమని చప్పుడుతో తెరచుకుని, లోపలికి రాగానే, సీతావతి ఎవరొచ్చారా అని బయటకు వచ్చింది. వెనకాలే కొంగుపట్టుకొని చంటిగాడు. బామ్మగారి గురించి అడిగాడు రోహిత్, తనని పరిచయం చేసుకుంటూ. కళ్ళల్లో నీళ్ళు సుడిగుండాలై తిరుగుతుంటే, బయటకు రానీయ కుండా ఆపుకుంటూ, తాళం వేసిన సుందరమ్మగారి యింటి గుమ్మం వైపు చూపించింది సీతావతి.

తాళం తీయబోతుంటే వద్దని వారించి, అక్కడే కూర్చుండిపోయాడు. గుండెల్లో ఏదో తెలియని బాధ తొలిచేస్తుంటే. అప్పుడు సీతావతే మాట్లాడుతూ "బాబూ! మీరు ఫోన్ చేసిన రెండు రోజుల పాటు ఆవిడ ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. కాలనీలో మీ విషయం గురించి విననివారు ఎవరూలేరు. ఆ ఆనందంలో ఆయాసం, ఆవేశం, అలసట లేకుండా, తెలియకుండా గడిపేసారు. తెలిసిన లాయరు గారిని పిలిపించి, యిల్లు స్థలం అన్నీ మీ పేరు మీద మార్పించారు. డాక్టరుగారి దగ్గరికి వెళ్ళాల్సిన అవసరం లేనంత ఆరోగ్యంగా కనిపించారు.

"ఏదో ఆయన పుణ్యమా అని నేను ఈ మాత్రం స్థితిలో వున్నందుకు సంతోషించాలో, లేక నాకోసం తన వారినందరిని, చివరకు కొడుకుని కూడా వదులుకున్న ఆయనగారి గతం తలుచుకొని బాధపడాలో అర్థంకాని పరిస్థితిలో ఉన్న నాకు ఒకప్పుడు కాని, ఎప్పటికీ ఓదార్పులతో పని లేదు."

మీ తాతయ్యగారి ఫోటో ముందు కూర్చుని ఏమిటో కబుర్లు చెబుతూ కనిపించారు. ఏమైందో, ఏమో తెలియదు కాని, మూడో రోజు ఉదయం ఎంతకీ తలుపులు తీసుకుని బయటకు రాకపోయేసరికి, కొద్దిసేపు ఎదురుచూసి, చుట్టు పక్కల వాళ్ళని పిలిచి, తలుపులు బలవంతంగా తెరిచి చూసాం. హాయిగా పడక కుర్చీలో దీర్ఘనిద్రావస్థలో కనిపించారు. చేతిలో లాయరుగారు యిచ్చిన పేపర్లు పట్టుకొని తీసుకు వస్తాను వుండండి'' అని యింట్లోకి వెళ్ళింది.

రోహిత్ దుఃఖాన్ని దిగమింగుకుంటూ - "ఒక్కఫోను తప్పుగా వెళ్ళటం వల్ల, ఒక మనిషికి ఎంతటి ఆనందాన్ని కలిగిస్తుంది. ఏ బాధలు తెలియని, ఎవరికోసం ఎదురు చూడని లోకాలకు చేరుస్తుంది. ఏమిటీ వింత సంఘటన నా జీవితంలో?'' అన్న ఆలోచనలలో మునిగి పోయాడు. సీతావతి, రోహిత్ ఆలోచనలకి అడ్డు తగులుతూ యింటి పేపర్లు తెచ్చి యిచ్చింది.

"మీరు యింటి గురించి ఏ నిర్ణయం తీసుకోవా లనుకున్నా మాకు కబురు చేయండి. సుందరమ్మగారి ఆత్మశాంతి కోసం మేమేమి చేయడానికైనా సిద్ధమే'' చెప్పింది సీతావతి.

ఒక్క నిమిషం పాటు ఆలోచించి పేపర్లు తీసుకొని బయలుదేరాడు రోహిత్. పెరట్లో అరుగుమీద చింత గింజలతోటి ఆడుతూ కనిపించాడు శ్రవణ్. శ్రవణ్ దగ్గరకి వెళ్ళి, తలనిమిరి, "ఈ పేపర్లు తీసుకో, వీటికి నిజమైన అర్హుడివి నువ్వే. మనవడి విలువ తెలియజేసి అసలైన ఆనందాన్ని పంచింది నువ్వే కదా!" అని చెప్పి రోహిత్ కారువైపు బయలుదేరాడు. అరుగుపక్కనే ఎండిన బాదం విస్తరాకులు రోహిత్ కంట బడలేదు. వాటి అవసరం యింక ఎవరికీ లేదు కూడా!

***